AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com

కరువు వేళ ఉపాధి రక్ష





నాటు బాంబు పేలి ఆరుగురికి గాయాలు



ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన 'ఓట్ బచావో – దేశ్ బచావో' ధర్నాకు నిజామాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. – అక్షరటుడే, నిజామాబాద్ సిటీ

రాష్ట్రవ్యాప్తంగా రూ.కోట్ల విలువైన బియ్యం దోచేసిన రైస్ మిల్లర్ల భరతం పట్టేందుకు ప్రభుత్వం సీఐడీ అధికారులను రంగంలోకి దింపింది. కస్టం మిల్లింగ్ అక్రమాలపై సీరియస్‌గా ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీకాంత్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో రైస్‌మిల్లర్లలో వణుకు పుట్టింది. తాము అరెస్ట్ కాకుండా ఉండేందుకు పలువురు రైస్‌మిల్లర్లు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం.

– అక్షరటుడే, నిజామాబాద్ క్రైం



హైకోర్టుకు చేరిన రైస్‌మిల్లర్ల పంచాయితీ..

■ సన్నరకం వడ్లకు బదులు దొడ్డుబియ్యం ఇచ్చిన మిల్లర్లు ■ సీఐడీ విచారణలో బట్టబయలు

■ అరెస్ట్ కాకుండా హైకోర్టుకు వెళ్లిన మిల్లర్లు ■ కఠిన చర్యలకు సిద్ధం అవుతున్న ప్రభుత్వం

జిల్లాలో సీఎంఆర్ దోచుకున్న రైస్‌మిల్లర్లపై సీఐడీ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఏకంగా 16 మందిపై కేసులు నమోదు చేశారు. 15 మందిని ఇదివరకే అరెస్ట్ చేయగా.. ఒకరు మాత్రం పరారీలో ఉన్నట్లు సమాచారం. అలాగే వారిని కస్టడీలోకి తీసుకుని విచారణ చేశారు. ఈ విచారణలో పలువురు అవినీతి రైస్‌మిల్లర్ల బాగోతాన్ని లెక్కలతో సహా సీఐడీ అధికారులు బయటపెట్టినట్లు సమాచారం.

దాడుల భయంలో అజ్ఞాతంలోకి..

జిల్లాలో ఎన్నడూ లేనివిధంగా రైస్‌మిల్లర్లపై సీఐడీ దృష్టి సారించింది. ఏళ్లకు ఏళ్లు ప్రభుత్వానికి రేషన్ బియ్యం ఇవ్వకుండా.. అలాగే సన్నరకం వడ్లు తీసుకుని దొడ్డురకం బియ్యం ఇచ్చిన మిల్లులపై దేగకన్ను వేసింది. ఈ రీతిలో దాడులు జరుగుతాయని రైస్‌మిల్లర్లు ఊహించలేదు. దీంతో తమపై ఎక్కడ కేసులో నమోదవుతాయోనన్న భయంతో పలువురు మిల్లుల యజమానులు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. జిల్లాలో 60కి పైగా రైస్‌మిల్లుల్లో జరిగిన అవినీతిని సీఐడీ అధికారులు తవ్వుతున్నారు. ఈ క్రమంలో మరికొందరిపై కేసులు నమోదయ్యే అవకాశం ఉందని వినికిడి.

పౌర సరఫరాల శాఖ అధికారి సస్పెన్షన్‌తో..

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి సస్పెన్షన్ జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. మిల్లులను తనిఖీ చేయడంలో నిర్లక్ష్యం, ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించడంలో నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి బాధ్యుడిని చేస్తూ ఆయనను శనివారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం సీఐడీ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. అనంతరం కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. దీంతో సీఎంఆర్ బకాయిల లెక్క తేలే అవకాశముందని సమాచారం. మరికొందరు అధికారులను కూడా విచారించే అకాశముందని తెలుస్తోంది.

60 రైస్‌మిల్లుల లెక్కతేలాలి

జిల్లాలో దాదాపు ప్రతిఒక్క రైస్‌మిల్ సీఎంఆర్ విషయంలో ప్రభుత్వానికి బాకీ ఉందని ఓ అధికారి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి రూ.కోట్లల్లో సీఎంఆర్ బకాయిలు పేరుకుపోయాయి. ఏళ్లుగా పెండింగ్ ఉన్న బకాయిల వసూళ్లలో ఉప్పటి వరకు జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరించారు. అలాగే పలువురు అవినీతికి పాల్పడి గవ్‌చుప్ అయ్యారని కూడా తెలుస్తోంది. ప్రస్తుతం సీఐడీ అధికారులు విచారణ చేస్తే జిల్లావ్యాప్తంగా రైస్‌మిల్లుల బండారం బయటపడనుంది. వారికి సపోర్ట్ చేసిన అధికారులు బాగోతం కూడా తెలిసిపోతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



ఓట్ బచావో – దేశ్ బచావో కార్యక్రమానికి కాంగ్రెస్ నేతలు

అక్షరటుడే, ఎల్లారెడ్డి: ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ఆదివారం ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కామారెడ్డి జిల్లా నుంచి వెళ్లిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావు రామ్‌లీలా మైదానానికి బయలుదేరారు. ఓటు హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, రాజ్యాంగ విలువల కాపాడటమే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ ఉద్యమాన్ని చేపట్టింది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఐక్యంగా తరలివెళ్లి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.



గ్రామసభకు హాజరుకాని అధికారులపై ఆగ్రహం!

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలోని కాటేపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ మహాదేవి శివకుమార్ పటేల్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. అయితే సభకు సంబంధిత అధికారులు హాజరుకాకపోవడంపై ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నిర్వహించాల్సిన గ్రామసభకు టీఏ, ఏపీఎం హాజరుకాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. అధికారులు రాకపోవడంతో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ ఈ విషయాన్ని ఏపీఎం సుదర్శన్ దృష్టికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఉపాధిహామీ పనులపై గ్రామ సభకు అధికారులు ఎందుకు హాజరుకాలేదని, దీనిపై గొడవ చేస్తున్నారని తెలిపారు. దీనికి ఏపీఎం సుదర్శన్ స్పందిస్తూ ఆదివారం రోజు సెలవు కావడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని సమాధానమిచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే, ఆదివారం అని తెలిసినప్పుడు అదే రోజున గ్రామసభను ఎందుకు ఏర్పాటు చేశారని గ్రామస్తులు ప్రశ్నించారు. గ్రామసభ నిర్వహణపై ముందస్తు సమాచారం, అధికారుల హాజరు విషయంలో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై గ్రామస్తులు రాతపూర్వకంగా ఫిర్యాదు లేఖను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపేందుకు పంచాయతీ కార్యదర్శి, సోషల్ ఆడిట్ బృందానికి అందజేశారు. గ్రామసభల నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సంబంధిత అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాటిగల్లీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో కడల పండుగ



అక్షరటుడే, ఇందూరు: నగరంలోని పాటిగల్లీ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బోనాలు ఎత్తుకున్న మహిళలు ఊరేగింపు తీశారు. అనంతరం గ్రామదేవతలకు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పాటిగల్లి వినాయక్ నగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, భూమయ్య, ఉపాధ్యక్షుడు చిరంజీవి, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, సంయుక్త కార్యదర్శులు రవీందర్, రాజేందర్, కోశాధికారి చింతకాయల రాజు, డైరెక్టర్లు, మున్నూరుకాపు కులస్తులు పాల్గొన్నారు.

ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో కామారెడ్డి కాంగ్రెస్‌నేతలు



అక్షరటుడే, కామారెడ్డి: ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన భారీ ధర్నా కార్యక్రమానికి కామారెడ్డి నుంచి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ హాజరయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు రాష్ట్రం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలి వెళ్తున్నారు. ఇందులో భాగంగా కామారెడ్డి జిల్లా నుంచి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి దంపతులు ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కామారెడ్డి జిల్లా నుంచి విచ్చేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో వారు సమావేశమయ్యారు. అనంతరం అక్కడి నుంచి కలిసి రామ్‌లీలా మైదానంలోని ధర్నా వేదికకు తరలివెళ్లారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, దానిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల వ్యవస్థలో అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటంలో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు క్రియాశీలకంగా పాల్గొంటాయని తెలిపారు. ఓటు మన హక్కు-ప్రజాస్వామ్యం మన బాధ్యత అనే నినాదంతో ఈ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక భరోసా




అక్షరటుడే, భీమ్‌గల్: అనారోగ్య సమస్యలతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఇద్దరు బాధితులకు సీఎం ఆర్ఎఫ్ ద్వారా రూ.3.25 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చొరవతో మంజూరైన ఎల్ఓసీ పత్రాలను హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మెండోరా మండల కేంద్రానికి చెందిన ఎం.డి. మహమ్మద్‌కు రూ.75 వేలు, వేల్పూర్ మండలం జానకంపేట్‌కు చెందిన గంట స్టాన్లీకి రూ.2.50 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నామావరపు రాజేశ్వర్ రావు నిజామాబాద్ జిల్లా పరిపాలన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో న్యాయవాది పరిషత్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు మల్లెపూల జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా లో పర్యటించాల్సిందిగా కోరారు. జిల్లా కోర్టు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నీలకంఠ రావు, న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, జగదీశ్వర్ రావు, జీవీ కృపాకర్ రెడ్డి, ఎం.గోవర్ధన్ ఆకుల రమేష్, విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మున్నూరుకాపు సంఘం గాండ్ల తర్ప–1 ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు..

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : నగరంలోని శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం గాండ్ల తర్ప-1 ఆధ్వర్యంలో బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తర్ప మహిళలు పెద్దఎత్తున బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. గాండ్ల తర్ప-1 పాలకవర్గ సభ్యులు శివాజీ నగర్ మున్నూరు కాపు సంఘం గాండ్ల తర్ప 1 పాలక వర్గం సభ్యులు రామర్తి గంగాధర్, గాండ్ల లింగం, శెట్టి రాజు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది దసరా దీపావళి మధ్య రెండో ఆదివారం బోనాల పండుగను నిర్వహిస్తామని పేర్కొన్నారు. నగరంలోని పల్లె వాతావరణం ప్రతిబింబించేలా మహిళలు అందంగా ముస్తాబై బోనాల తీసి ఊరేగింపు నిర్వహించారన్నారు. శివాజీనగర్ మున్నూరుకాపు సంఘం ఏడు తర్పల ఆధ్వర్యంలో ఆదివారం బోనాలు పండుగ జరుగుతుందన్నారు. సంఘంలో వెయ్యి గడపలు ఉన్నాయని.. పెద్ద ఎత్తున తర్ప సభ్యులు ఈ కడల పండుగలో పాల్గొని విజయవంతం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తర్ప పెద్దకాపు రామర్తి రాజు, కోశాధికారి బొంపల్లి భూమయ్య, సంఘం మేనేజర్ రాజు, రామర్తి రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ర్యాలీకి బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు



అక్షరటుడే, బాన్సువాడ: ఢిల్లీలో నిర్వహించిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' భారీ బహిరంగ సభకు బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరయ్యారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత అనే అంశాలపై నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఇండియా కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్రియాల్ ఎక్స్‌రోడ్ వద్ద కేటీఆర్‌కు ఘనస్వాగతం



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఆదిలాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రైతు గర్జన సభకు హైదరాబాద్ వెళ్తున్న కేటీఆర్‌కు కుప్రియల్ ఎక్స్‌రోడ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి కేటీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు పార్టీ శ్రేణులు ఉత్సాహంగా తరలివచ్చాయి. జై తెలంగాణ నినాదాలతో ఎక్స్ రోడ్ ప్రాంతం మార్మోగింది.

ఆర్మూర్‌లో..

అక్షరటుడే, ఆర్మూర్: అదిలాబాద్ రైతు గర్జన సభకు వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్‌లో ఘనస్వాగతం పలికారు. గజమాలతో ఆయనను సత్కరించారు. సీఎం సీఎం అంటూ నినాదాలతో బీఆర్ఎస్ కార్యకర్తలు హోరెత్తించారు.



ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ప్రణాళిక వేస్తున్నారు. గ్రామీణ ప్రాంత కూలీలకు చేతినిండా పని కల్పించడం, భూగర్భ జలాల పెంపు, పశుగ్రాసం అభివృద్ధి, పశువులకు తాగునీటి సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఈ మేరకు ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులను విస్తృతం చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి దామోదర్‌రెడ్డి వెల్లడించారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి



కరువు వేళ.. 'ఉపాధి' రక్ష..

■ కరువును ఎదుర్కొనేందుకు సిద్ధం! ■ గ్రామీణులకు భరోసా ఇస్తున్న ఉపాధి పనులు
■ ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు ■ పశుగ్రాసం పెంపు, పశువుల నీటి తొట్టెల నిర్మాణానికి ప్రాధాన్యం

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటివరకు 29.35 లక్షల పనిదినాలు కల్పించగా, కూలీల ఖాతాల్లో రూ.75.88 కోట్ల వేతనాలు జమ చేశారు. ప్రస్తుతం సగటున ఒక్కో గ్రామంలో 92 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ సంఖ్యను మరింత పెంచి అదనంగా 43 లక్షల పనిదినాలు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 1,35,912 జాబ్ కార్డుల ద్వారా 2,15,329 మంది కూలీలు ఉపాధి పొందుతున్నారు. కరువు పరిస్థితులు ఎదురైనా గ్రామీణ ప్రజలకు పనుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఉపాధి అనుసంధానం..

ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కూడా ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణానికి సంబంధించి 4.50 లక్షల పనిదినాలు కల్పించగా, తాజాగా మంజూరైన ఇళ్లకు కూడా ఉపాధి పనులు కల్పించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి అదనంగా 90 రోజుల వరకు పని దినాలు కల్పించేలా చర్యలు చేపడుతున్నారు. తద్వారా లబ్ధిదారులకు ఆర్థికంగా కొంత ఊరట లభించనుంది

పశువులకు మేత, తాగునీటి సౌకర్యాలు

ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో పశువులకు మేత, తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నారు. గ్రామాల్లో పశుగ్రాసం పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు పశువుల కోసం నీటి తొట్టెల నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఒక్కో నీటి తొట్టె నిర్మాణానికి సుమారు రూ.35 వేల నుంచి రూ.45 వేల వరకు ఖర్చు చేయనున్నారు. ఐదు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పు, రెండు అడుగుల ఎత్తుతో వీటిని నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. గొర్రెలకు కూడా నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు.

భూగర్భ జలాల అభివృద్ధికి

ఉపాధి కూలీల ద్వారా చేపట్టే పనుల్లో భూగర్భ జలాల వృద్ధికి సంబంధించిన జలసిరి పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట చెరువులు వంటి పనులు చేపడుతున్నారు. ఇంటింటికీ ఇంకుడు గుంత నిర్మించుకోవడం ద్వారా భూగర్భ జలాల వృద్ధికి దోహద పడవచ్చు. ఊట చెరువు కూడా నిర్మించుకోవచ్చు. జిల్లాలో 25 వేల సోక్ పిట్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఉపాధిహామీ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు కరువు పరిస్థితులను తట్టుకునేలా నీటి సంరక్షణ పనులు, భూగర్భ జలాల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. వివిధ గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పనులు చేపట్టనున్నారు. ఉపాధి కల్పనతో పాటు గ్రామాల అభివృద్ధికి ఈ పథకాన్ని సమర్థవంతంగా వినియోగించనున్నట్లు డీఆర్డీవో దామోదర్‌రెడ్డి వివరించారు. కరువు పరిస్థితులు వచ్చినా గ్రామీణ ప్రజలకు ఉపాధి, పశువులకు మేత, తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

హైదరాబాద్ హైటెక్ మారథాన్‌లో ఎస్సై సుధాకర్ ప్రతిభ

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: హైదరాబాద్‌లో ఎన్ఈబీ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో హైటెక్ మారథాన్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో నిజామాబాద్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.సుధాకర్ ప్రతిభ కనబర్చారు. మారథాన్‌లో సుధాకర్ 42.195 కిలోమీటర్ల దూరాన్ని 6 గంటల 18 నిమిషాల్లో విజయవంతంగా పూర్తిచేశారు. ఇది ఆయన రెండవ ఫుల్ మారథాన్ కావడం విశేషం. ఈ ఏడాది ఇప్పటివరకు రెండు హాఫ్ మారథాన్లు, రెండు ఫుల్ మారథాన్లు పూర్తి చేశారు. పోలీస్ శాఖలో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తూనే, శారీరక దృఢత్వం, ఆరోగ్యం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ పరుగును తన జీవితంలో భాగంగా చేసుకున్నారు. పరుగులు కేవలం పతకాలు, రికార్డుల కోసం మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలి, మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని సుధాకర్ పేర్కొన్నారు.



క్రికెట్‌లో ప్రతిభ చూపుతున్న పిట్లం కుర్రోడు..

అక్షరటుడే, ఎల్లారెడ్డి: హెచ్‌సీఏ (బీ) డివిజన్ వన్‌డే లీగ్‌లో పిట్లం మండలానికి చెందిన యువ క్రికెటర్ విక్రాంత్ రెడ్డి ప్రతిభతో సత్తా చాటుతున్నాడు. నిజామాబాద్ జిల్లా జట్టు, మెగాసిటీ జట్టు మధ్య అక్టోబర్ 29న జరిగిన మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానులను ఆకట్టుకున్నాడు. మైదానంలో బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వరద పారిస్తూ ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ మ్యాచ్‌లో విక్రాంత్ రెడ్డి కేవలం 95 బంతులు ఎదుర్కొని 147 పరుగులు సాధించాడు. తన అద్భుత ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 8 భారీ సిక్సర్లు బాది జట్టు స్కోరు పెరగడంలో కీలక పాత్ర పోషించాడు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించి తనలోని ప్రతిభను చాటుకున్నాడు. పిట్లం మండలం తిమ్మానగర్ గ్రామానికి చెందిన సత్యం రెడ్డి కుమారుడైన విక్రాంత్ రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. చదువుతో పాటు క్రికెట్ పై ఆసక్తిని కొనసాగిస్తూ వరుసగా అద్భుత ప్రదర్శనలు చేస్తున్నాడు.





భీమ్‌గల్‌ను కరువు మండలంగా ప్రకటించాలి

అక్షరటుడే, భీమ్‌గల్: మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరుబావులు ఎండిపోవడంతో వరి పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు సరఫరా సరిగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇటీవల ప్రకటించిన కరువు మండలాల జాబితాలో భీంగల్‌కు చోటు కల్పించకపోవడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలకు నీరు అందించారన్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కార్పొరేషన్ ఛైర్మన్లు ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్‌కుమార్ తదితరులు ఈ ప్రాంత సమస్యలపై దృష్టి సారించాలని కోరారు

బాన్సువాడలో నాటు బాంబు పేలి ఆరుగురికి గాయాలు







అక్షరటుడే, బాన్సువాడ: పట్టణంలోని ఎర్రమన్ కచ్చా ప్రాంతంలో ఆదివారం నాటు బాంబులు పేలిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఆరుగురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. ఎర్రమన్ కచ్చా ప్రాంతానికి చెందిన దాసరి లక్ష్మయ్య ఇంటి వద్ద మోపెడ్‌లో పందుల వేట కోసం నిల్వ ఉంచిన నాటు బాంబులు ప్రమాదవశాత్తు ఒక్కసారిగా పేలినట్లు తెలుస్తోంది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో దాసరి లక్ష్మయ్యతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. పేలుడు ధాటికి గాయపడిన వారిని స్థానికులు వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల పూర్తి కారణాలు, బాంబుల నిల్వ వెనుక ఉన్న వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

దాసాంజనేయ మందిర ఆవరణలో స్వచ్ఛ భారత్

అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల దాసాంజనేయ మందిరం ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మందిరం ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ టీచర్ రాంరెడ్డి మాట్లాడుతూ.. మందిరం ఆవరణలో ఉన్న చెత్తాచెదరాన్ని తొలగించడం ఎంతో సంతోషకర విషయమన్నారు. అడ్వకేట్ శ్రీధర్, చిల్క కిష్టయ్య, రాధాకిషన్ మాట్లాడుతూ.. కాలనీలో ఉన్న మందిరం ఆవరణలోలో ఇలాంటి స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛ కార్యక్రమంలో భాగంగా 78వ ఆదివారం దాసాంజనేయ మందిరం ఆవరణను శుభ్రం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, రమేష్, రాజ్ కుమార్, సుంకే నిశాంత్, ఆదిత్య, సుమన్, భోజన్న, గణేష్, శ్యామ్ సుందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

